ప్రయాణం.. సుఖమయం

- ఆకర్షణీయంగా అంతర్గత సిమెంట్ రోడ్లు
- రూ.11.55 కోట్లతో 30.878 కిలోమీటర్ల నిర్మాణం

తుని రూరల్: గ్రామీణులకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా వివిధ గ్రాంట్లతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు ఆకర్షణీయంగా రూపు దిద్దుకున్నాయి. 14, 15 ఆర్థిక సంఘం నిధులు, గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో పాటు పంచాయతీ నిధులు వినియోగించి నిర్మించిన రోడ్లతో గ్రామీణులకు మెరుగైన రహదారులు ఏర్పడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ గ్రామాల్లో అంతర్గత రోడ్లను నిర్మిస్తోంది. 2019 జూన్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకూ నియోజకవర్గంలో రూ.11.55 కోట్లతో రూ.30.878 కిలోమీటర్ల పొడవునా నిర్మించిన సిమెంట్ రోడ్లు వాడుకలోకి వచ్చాయి. మరో పది కిలో మీటర్లకు పైగా రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. అదేవిధంగా రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రాలకు వెళ్లొచ్చే ప్రధాన రహదారులు విస్తరణ, ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. నిధుల లభ్యత, ప్రాధాన్యతలను బట్టి మరిన్ని రహదారులు నిర్మిస్తామని పీఆర్ డీఈ శివాజీరావు తెలిపారు.


తుని నుంచి కవలపాడు వెళ్లేందుకు ఇటీవల నిర్మించిన ప్రధాన రహదారి


ఎస్.అన్నవరం పోస్టాఫీస్ వీధిలో నిర్మించిన రోడ్డు

ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ, ఆధునీకరణ

తుని మండలం ఎస్.అన్నవరం నుంచి తొండంగి మండలం పైడికొండ వరకూ 9.7 కిలోమీటర్ల రహదారిని రోడ్లు భవనాల శాఖ విస్తరిస్తోంది. సెంట్రల్ రోడ్డు ఫండ్ నిధులు రూ.18కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎస్.అన్నవరంలో 400 మీటర్ల పొడవునా 15 మీటర్ల వెడల్పుతో సెంటర్ డివైడర్ రోడ్డు, 9.3 కిలోమీటర్ల పొడవునా 7.5 మీటర్ల వెడల్పుతో పైడికొండ వరకూ రోడ్డు విస్తరణ చేపట్టారు. కోటనందూరు మండలం అల్లిపూడి వద్ద తాండవ నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సీఆర్ఎఫ్ నిధులు రూ.పది కోట్ల మంజూరయ్యాయి. పనులు చేపట్టాల్సి ఉంది. ప్రత్యేక మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఏడు కోట్లు గ్రాంటు మంజూరు చేసింది. ఈ నిధులతో నాలుగు రహదారులకు మరమ్మతులు చేయాల్సి ఉంది. రూ.2.30 కోట్లతో టి.తిమ్మాపురం, అగ్రహారం, తొండంగి రోడ్డు 10.10 కిలోమీటర్లు, రూ.1.40 కోట్లతో 16వ నంబరు జాతీయ రహదారి నుంచి దుర్గాడ, పీఈ చిన్నయ్యపాలెం వరకు ఆరు కిలోమీటర్లు, రూ.1.50 కోట్లతో హంసవరం, తొండంగి వరకు పది కిలో మీటర్లు రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. రూ.1.80 కోట్లతో తుని, నర్సీపట్నం, బిళ్లనందూరు, ఎస్ఆర్ పేట వరకు 10.60 కిలో మీటర్ల రోడ్ల మరమ్మతు పనులను ఈ వారంలో చేపట్టనున్నట్టు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

మండలాల వారీగా నిర్మించిన రోడ్లు, వ్యయం

మండలం	నాలుగేళ్లలో వేసిన సీసీ రోడ్లు(మీటర్లలో)	వ్యయం (కోట్లలో)
తుని	12,819	రూ.4.75
తొండంగి	12,058	రూ.4.64
కోటనందూరు	6001	రూ.2.16
మొత్తం	30,878	రూ.11.55

సరిహద్దు గ్రామస్తులకు ప్రయోజనం



తుని పట్టణం పెంటకోట రోడ్డు నుంచి కవలపాడుకు ఇటీవల సిమెంట్ రోడ్డు వేయడంతో మండలాల సరిహద్దు గ్రామస్తులకు ప్రయోజనం. ఈ రోడ్డు నిర్మాణంతో కాకినాడ జిల్లా తుని మండలం కవలపాడు గ్రామస్తులకు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరు, ఈదటం, పాల్‌మేన్‌పేట తదితర గ్రామస్తులకు ప్రయోజనంగా ఉంది.

– గంటా చక్రరావు, కొత్త సూరవరం, తుని మండలం

తొలగిన ఇబ్బందులు



దీర్ఘకాలంగా గ్రామంలో సరైన రహదారులు లేకపోవడంతో ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. దీంతో గ్రామస్తుల రాకపోకలకు ప్రయాణం సుఖవంతమైంది. కాలువలు ఏర్పాటు చేయడంతో మురుగు సమస్య పరిష్కారమైంది.

– సుర్ల నాగేశ్వరరావు, టి.జి.నగరం, కోటనందూరు మండలం

108లో ప్రసవం


108 అంబులెన్స్‌లో జన్మించిన శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

గండేపల్లి: పురుట నొప్పులతో బాధ పడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మగ శిశువుకు జన్మించింది. మండలంలోని ఎన్టీ రాజాపురానికి చెందిన దుర్గాదేవికి రెండో కాన్పునకు గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా పురుట నొప్పులు ఎక్కువవడంతో మార్గం మధ్యలోనే ప్రసవం చేసినట్టు ఈఎంటీ ప్రసాద్, నవీన్, పైలెట్ గణపతి, ఆశ వర్కర్ దుర్గ తెలిపారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వీరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ నిర్వహించారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో 6వ వార్డులో సీసీరోడ్డు, 20వ వార్డులో డ్రైన్ నిర్మించనున్నారు. నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు పట్టణంలోని అభివృద్ధి పనులకు వేగంగా జరుగుతున్నాయన్నారు. పార్టీనాయకులు కోనాల వెంకటరమణ, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, తొండారపు రాంబాబు, కడింశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

గంటా తరుణ్‌కు అభినందన


తరుణ్‌ను అభినందిస్తున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు

తుని: హైరేంజ్ వరల్డ్ రికార్డులో సత్తా చాటిన స్థానిక సీతారాంపురానికి చెందిన గంటా తరుణ్‌ను మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు అభినందించారు. గత నెల 27న హైదరాబాదులో జరిగిన మోస్టు ఫుల్ ఎక్స్‌టాన్సన్ 1 హ్యాండ్ పంచెస్ హోల్డింగ్ 1 కేజీస్ వెయిట్‌లో స్థానిక సీతారాంపురానికి చెందిన గంటా తరుణ్ సత్తా చాటాడు. ఒక్క నిమషంలో 150 పంచెస్ ఆడి తరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తరుణ్‌ను నిర్వహకులు సర్టిఫికెట్, మెమెంటోతో సత్కరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమలో వార్డు కౌన్సిలర్లు షేక్ క్వాజా, సునీత, గంటా కొండలరావు, గంటా సత్యవతి, పులుగు రాజు, మైలపల్లి నాగేశ్వరరావు, ఆరుగుల ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ


చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు సోకకుండా, రోజూ ఇంటి దగ్గర చేయించే వ్యాయామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

దాడులకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


తూర్పులక్ష్మీపురంలో నిరసన తెలుపుతున్న యువజన సంఘం సభ్యులు

ఏలేశ్వరం: శృంగవరంలో దాడులకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తూర్పులక్ష్మీపురంలో గురువారం ఆందోళన చేశారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లాకార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ దాడుల్లో చనిపోయిన వారికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బత్తిన ప్రసాద్, బులిపే బుజ్జిబాబు, దొమ్మేటి చినబాబు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

గండేపల్లి: కోడి పందేలపై దాడి చేసి, ఐదుగురిని అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యల్లమిల్లి గ్రామ శివారులో పందెం ఆడుతున్న వారిపై దాడి జరిపి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.8200 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

లేగదూడల అందాల పోటీలు


అందాల పోటీలో లేగదూడలను పరిశీలిస్తున్న పశువైద్య సిబ్బంది

గండేపల్లి: మల్లేపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అంబేడ్కర్, జగ్గంపేట సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పశుగణాభివృద్ధి ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు ఆయా గ్రామాలలో గల ఆర్‌బీకే కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం నిర్వహించిన లేగ దూడల అందాల పోటీల్లో నెల రోజుల నుంచి ఏడాది వయస్సు కలిగిన లేగదూడలు పాల్గొనగా ప్రథమ బహుమతి వల్లభశెట్టి శ్రీకృష్ణ, ద్వితీయ బహుమతి బిత్రా ఆదినారాయణ, తృతీయ బహుమతి రాయిపాటి వెంకట్రావులకు చెందిన లేగదూడలకు దక్కాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భవాని, సుప్రియ, వీఏఎస్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది షేక్ సబీనా, పి.సత్యనారాయణ, ఎన్.శివ, గోపాల మిత్ర సిబ్బంది అప్పలరాజు, శ్రీనివాసు, అబ్బులు, వైఎస్సార్ సీపీ నాయకులు బలిరెడ్డి గంగరాజు, బిత్రా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

తుని రూరల్: రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24న ఎస్.అన్నవరం శివారు సాయివేదికలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు మంత్రి కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. నిపుణులైన 25 మంది వైద్యులు పాల్గొని అన్నిరకాల సేవలు అందిస్తారన్నారు. అదేవిధంగా రక్తదానం శిబిరం, అవయవ దాన దాతల నుంచి అంగీకార పత్రాలు తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొని ఉచిత వైద్య, రక్తదానం, అవయవ దానం శిబిరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రీ సర్వేను పరిశీలించిన ఆర్డీఓ


సింగరంపాలెంలో రికార్డుల పరిశీలిస్తున్న ఆర్డీఓ

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెం, తాళ్లూరు గ్రామాల్లో భూముల రీ సర్వేను పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల సర్వేయర్ కె.లక్ష్మి, వీఎస్, వీఆర్వో, తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ మార్పుతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఫ్లూ జ్వరాలు, జలుబులతో పిల్లలు బాధపడుతున్నారన్నారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి బయడపడొచ్చన్నారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిలువు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. మూడు రోజుల పాటు జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అదనపు తరగతి గదుల నిర్మాణం


ఏవీ నగరం హైస్కూల్లో ఏసీఆర్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

తొండంగి: ఏవీ నగరం జెడ్పీ హైస్కూల్లో అరబిందో ఫాండేషన్ ఆర్థిక సహాయం రూ.60 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొయ్యా మురళీ మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను హైస్కూల్లో కలపడంతో అదనపు తరగతి గదుల కొరత ఏర్పడిందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు వాటి నిర్మాణానికి అరబిందో సంస్థ ముందుకొచ్చిందన్నారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్‌కు దోహదపడే పలు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకొచ్చి అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, నిత్యానందరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన


పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న పద్మావతి

శంఖవరం: స్థానిక సచివాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమంపై సీడీపీఓ పద్మావతి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ్ పక్వాడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎనిమిది రకాల చిరు ధాన్యాలతో కూడిన పోషణ్ పక్వాడ్‌ను అందిస్తారన్నారు. ఇది ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లచ్చబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు లచ్చబాబు, ఎంపీటీసీలు, ఐసీడీసీఎస్ సిబ్బంది, ఎంపీటీసీలు, ఏఎన్ఎంలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 37 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని పరీక్ష కేంద్రాల్లో గురువారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 37 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 442 విద్యార్థులకు గాను 423మంది, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలలో 240 మందికి గాను 222 మంది పరీక్షలకు హాజరైనట్టు కిర్లంపూడి జూనియర్ కళాశాల డీఓ అయులూరి శ్రీనివాసరావు, ప్రగతి జూనియర్ కళాశాల డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

నైపుణ్యాల మెరుగుకు కృషి


ఒప్పంద పత్రాలను చూపుతున్న గ్లోబల్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ సుగుణారెడ్డి

గండేపల్లి: విద్యార్థులలో నైపుణ్యాన్ని మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నట్టు ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్ సుగుణారెడ్డి తెలిపారు. క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్)లో విద్య, శిక్షణ కోసం థింక్ ప్లస్ సీఈఓ, వ్యవస్థాపకుడు పి.రామకృష్ణతో ఒప్పందం భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసినట్టు తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంల్ల పోటీ ప్రపంచంలో ఉద్యోగం, ఉన్నత చదువులు పొందేందుకు దోహదపడతాయని, ఎంఓయూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాము కుటుంబానికి న్యాయం చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కుల వివక్ష పోరాట సంఘం ప్రతినిధులు

తొండంగి: శృంగవృక్షం గ్రామ దేవత జాతరలో జరిగిన ఘర్షణ కారణంగా మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబానికి న్యాయం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల పరిహారంతో పాటు వ్యవసాయ భూమి, ఇంటి స్థలం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండు చేశారు. అలాగే గాయపడిన కుటుంబాలకు కూడా రూ.10 లక్షల చొప్పున పరిహారం, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. రాము మృతికి కారణమైన దోషులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఘర్షణకు కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన శిక్షణ అందించాలి

• జెడ్పీ సీఈఓ సత్యనారాయణ


ఉండూరులో స్వచ్ఛ సంకల్పంపై మాట్లాడుతున్న సీఈఓ సత్యనారాయణ

సామర్లకోట: స్వచ్ఛ సంకల్పంపై వివిధ మండలాల నుంచి వచ్చే సిబ్బందికి నాణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వాలని జెడ్పీ సీఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణకు జిల్లా నుంచి ఉండూరు యూనిట్‌ను ఎంపిక చేశామని, ఇక్కడ పొందిన శిక్షణను మోడల్ గ్రామాలుగా ఎంపికైన స్థానిక అధికారులకు వివరించాలని తెలిపారు. సామర్లకోట మండలం నుంచి అచ్చంపేట, పనసపాడు, గొల్లప్రోలు మండలం నుంచి ఏపీ మల్లవరం, చేబ్రోలు, పిఠాపురం మండలం నుంచి ఎఫ్‌కే పాలెం, చిత్రాడ, తొండంగి మండలం నుంచి తొండంగి, ఏవీ నగరం, ప్రత్తిపాడు మండలం నుంచి ధర్మవరం, ఉత్తరకంచి, జగ్గంపేట మండలంలో గోవిందపురం, రాజపూడి, కిర్లంపూడి మండలం నుంచి బూరుగపూడి, సోమరాయనిపేట, తామరాడ, సోమవరం, సుంగరాయనిపాలెం, సింహాద్రిపురం, రాజుపాలెం, పాలెం, ముక్కోలు, కృష్ణవరం, జగపతినగరం, గోనేడ, గెదనాపల్లి, రామకృష్ణపురం, వీరవరం, భూపాలపట్నం, ఎస్. తిమ్మాపురం, వేలంక, రామచంద్రపురం గ్రామాల్లోని పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిసెంట్, ఇంజినీరింగ్ అసిసెంట్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని వివరించారు. అన్ని గ్రామాలు శుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ నెల 31 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి గ్రామంలోను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు కావాలని పిలుపునిచ్చారు. డీపీఓ విక్టర్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా, పంచాయతీ సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వర్మీ కంపోస్టు యూనిట్‌ను సీఈఓ, డీపీఓలు పరిశీలించారు.

విప్లవయోధులకు నివాళులు


ఏలేశ్వరంలో భగత్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా శ్రేణులు


భగత్ సింగ్‌నగర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ జిల్లా నేతలు


ప్రత్తిపాడులో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న బంగారాజు

ఏలేశ్వరం: భారత విప్లవయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా ఆధ్వర్యంలో పట్టణంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్‌తోపాటు రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ను ఉరితీయడం బాధాకరమన్నారు. భారతదేశ ముద్దుబిడ్డ భగత్‌సింగ్ ఆశయాలను నేటియువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్రం వీరబాబు, కాకర నానాజీ, కంబాల బాలయ్య, చందక ప్రసాద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: స్థానిక లిబరేషన్ కార్యాలయంలో గురువారం భగత్ సింగ్ 92వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు భగత్ సింగ్ చిత్రపటానికి బుగత పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలూరు అల్లూరి సీతారామరాజు యూత్ అధ్యక్షుడు తాడి లక్ష్మణ్‌రావు, బోను రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. బార్ కార్యదర్శి రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు పిల్లి బలరాముడు, బండారు నరసింహరావు, బోడపాటి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ యువతకు ఆదర్శం

జగ్గంపేట: మండలంలోని పాఠశాలలు, సంస్థల్లో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. జగ్గంపేట వివేకనంద విద్యాసంస్థలలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భగత్‌సింగ్ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. గోవిందపురంలో సీపీఐ లిబరేషన్, గిరిజన సంఘం ఆధ్వర్యంలోను, జగ్గంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఇజ్జినమల్లి ఆధ్వర్యంలోను, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి ఏసు ఆధ్వర్యంలోను భగత్ సింగ్‌కు నివాళులర్పించారు.

వేగుళ్లమ్మకు పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ దేవత వేగుళ్లమ్మ తల్లి జన్మదిన పూజలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు సోదరులు అమ్మవారికి అభ్యంగన స్నానం ఆచరించి పంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా సౌభాగ్య స్త్రీలచే లలితాదేవి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు యశ్వంత్

సామర్లకోట: జాతీయ స్థాయి యోగా పోటీలకు సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి కిల్లాడి యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యాడు. అతడు ద్వితీయ స్థానం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, పీడీ తాళ్లూరి వైకుంఠం గురువారం విలేకర్లకు తెలిపారు. ఈనెల 18, 19 తేదీల్లో నరసాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన యశ్వంత్‌కుమారను వారు అభినందించారు. ఒరిస్సాలోని కటక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అతడు పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా బాలుడికి వారు కౌన్సిలర్ బలువు వాసుతో కలసి రూ.రెండు వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పి.మాధవీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.